క్లుప్తంగా

అనెస్తీషియా టెక్నీషియన్స్ రాష్ట్ర కార్యదర్శిగా దినేష్



కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ అనెస్తీషియా టెక్నీషియన్స్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కర్నూలుకు చెందిన ఎస్. దినేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం విజయవాడలో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ట్రెజరర్‌గా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఆర్. వినోద్‌కుమార్, రాష్ట్ర ఈసీ మెంబర్‌గా అమరనాథ్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం దినేష్ మాట్లాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి త్వరలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అనెస్తీషియా పోస్టులను మంజూరు చేసేలా కృషి చేస్తామన్నారు.

నేడు సైకియాట్రి జోనల్ సీఎంఈ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగర శివారులోని పెంచికలపాడు గ్రామంలో ఉన్న విశ్వభారతి మెడికల్ కాలేజీలో శనివారం సైకియాట్రి విభాగం జోనల్ సీఎంఈ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శివశంకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎనిమిది కళాశాలల నుంచి అనేక మంది సైకియాట్రిస్టులు, పోస్టు గ్రాడ్యుయేట్లు హాజరుకానున్నారని చెప్పారు. హైదరాబాద్‌లోని నీలోఫర్ హాస్పిటల్ నుంచి ప్రముఖ చైల్డ్ సైకియాట్రిస్ట్ డాక్టర్ రిషికేష్, ఇతర వైద్యకళాశాలల నుంచి అధ్యాపకులు హాజరై మానసిక ఆరోగ్యంపై వివిధ అంశాలపై కీలక ప్రసంగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ సైకియాట్రిక్ సంబంధిత సీఎంఈ జోనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ నాగేశ్వరరావు హాజరవుతున్నట్లు తెలిపారు.

క్రెడోది విద్యార్థికి ఉత్తమ క్యాడెట్ అవార్డు



విద్యార్థి కార్తీకేయరావును అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: క్రెడోది స్కూల్‌కి చెందిన విద్యార్థి కార్తీకేయరావుకు ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ వారు నిర్వహించిన క్యాడెట్ వెల్ఫేర్ సొసైటీ అవార్డు దక్కింది. ఈ మేరకు శుక్రవారం ఆ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కార్తీక్ కుమార్, ప్రిన్సిపాల్ శావ్య లక్ష్మీలు విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల అనంతపురంలో జరిగిన సీపీటీసీ (కంబైండ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపు)లో నిర్వహించిన డ్రిల్‌లో కార్తీకేయరావు ప్రతిభ చాటి రెండో స్థానంలో నిలిచాడన్నారు. కార్యక్రమంలో ఆ స్కూల్ ఎన్‌సీసీ(ఏఎన్‌ఓ), పీఈటీ, తదితరులను పాల్గొన్నారు.


బీసీలకు 52 శాతం రిజర్వేషన్‌ను కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో బీసీ జన కుల గణన వెంటనే చేపట్టి విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాల్లో 52 శాతం రిజర్వేషన్లను కల్పించాలని బీసీ జనసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్‌యాదవ్, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు శేషఫణి డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బీఎస్పీ ఆధ్వర్యంలో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లను కల్పించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బీసీల్లో ఎన్నో ఉపకులాలు ఉన్నాయని, వాటిలో చేతి వృత్తులు ఎక్కువగా ఉన్నాయన్నారు. వాటిని వృద్ధిపథంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు జయరాముడు, ఎర్రన్న, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సురక్షిత మాతృత్వం అందిస్తాం



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): గర్భిణికి సురక్షితమైన మాతృత్వాన్ని అందించడమే తమ ప్రధాన ఉద్దేశమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు సరైన ఆరోగ్య సంరక్షణ, ప్రసవానంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగే విధంగా చూసుకోవాలన్నారు. ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, గైనిక్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, వైద్యులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

- ఘనంగా నివాళులర్పించిన ప్రజా సంఘాలు, నాయకులు, అధికారులు

కర్నూలు(అర్బన్): అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఆయన చిత్రపటానికి, బిర్లాగేట్ సమీపంలోని పూలే విగ్రహానికి అధికారులు, పలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంటరానితనం, నిరక్షరాస్యతపై ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేసుకుంటూ, ఆయన చూపిన మార్గంలో నడవాలని ఆయా సంఘాల నాయకులు కోరారు.

- జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, ఉద్యోగులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే ప్రముఖ సామాజిక సంస్కర్త అని కొనియాడారు. మహిళా విద్య, హక్కుల పరిరక్షణకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని చెప్పారు. జెడ్పీ పరిపాలనాధికారులు కే సరస్వతమ్మ, కే జితేంద్ర, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో నాయకులు స్థానిక బిర్లాగేట్ సమీపంలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, నేతలు పెద్దపాడు ధనుంజయ, మహిళా విభాగం అధ్యక్షురాలు టీ శ్రీలీల, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.
- నగరంలోని బీ క్యాంప్ బీసీ భవన్‌లో పూలే 199వ జయంతి సందర్భంగా నేతలు పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుంజయ ఆచారి, నాయకులు జీ అయ్యన్నయాదవ్, శ్రీరాములుయాదవ్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

డీపీఓలో..

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజ శ్రేయస్సు కోసం పూలే చేసిన సేవలను ఈ సందర్భంగా కృష్ణమోహన్ కొనియాడారు. ఆర్ఐలు నారాయణ, సోమశేఖర్ నాయక్, ఏఆర్ఎస్ఐలు, ఏఆర్ పోలీస్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

పూలే అడుగుజాడల్లో నడుద్దాం

కర్నూలు(అర్బన్): బీసీల పితామహుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అడుగుజాడల్లో నడుద్దామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. జిల్లాలోని పలు విద్యా సంస్థల్లో జ్యోతిబా పూలే దంపతుల విగ్రహాలను అందించిన ఆయన శుక్రవారం పూలే జయంతి సందర్భంగా నగరంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక కల్లూరులోని బీసీ కళాశాల బాలికల వసతి గృహం, బీసీ స్టడీ సర్కిల్, బిర్లాగేట్, షరీన్‌నగర్‌లోని పూలే విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ మహాత్ములు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని, తమ పిల్లలను కష్టపడి చదివించాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.



పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేస్తున్న నక్కలమిట్ట శ్రీనివాసులు

సామాజిక వ్యవస్థలో మార్పు తెచ్చిన మహనీయుడు

కర్నూలు(సెంట్రల్): సామాజిక వ్యవస్థలో మార్పు కోసం జీవన పర్యంతం కృషి చేసిన ఘనత మహాత్మా జ్యోతిరావు పూలేకు దక్కుతుందని ఆర్‌యూ రెక్టార్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. వర్సిటీలోని ఇంజినీరింగ్ కాలేజీలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ అబ్దుల్ హక్ యూనివర్సిటీలో ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ పీఎస్‌షావిఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ్ తదితరులు పూలే సేవలను గుర్తు చేసుకున్నారు. వీహెచ్‌పీ నాయకులు మద్దిలేటి ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ఉర్దూ యూనివర్సిటీలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు



బీసీ భవన్‌లో పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న బీసీ నేతలు



జెడ్పీలో పూలే చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న సీఈఓ, ఉద్యోగులు

➤ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా మాట్లాడుతూ.. పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, పార్టీ నేతలు స్థానిక బిర్లాగేట్ సమీపంలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు విద్యాపరంగా ముందుకు రావాడంలో పూలే చేసిన కృషి ఎంతో ఉందన్నారు. ఆర్థిక అసమానతలు తొలగించిన ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అట్టడుగు వర్గాలకు చైతన్యం కలిగించి సమాన హక్కులు కల్పించిన ఘనత పూలే దక్కుతుందన్నారు. ప్రజలకు సమాన హక్కులు అనుభవిస్తున్నారంటే మహాత్మ జ్యోతిరావు పూలే అన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర నాయుడు, నగర బీసీ సెల్ అధ్యక్షుడు బబ్లూ, రాష్ట్ర కార్యదర్శి భారతి, కోశాధికారి కల్లా నరసింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శి అంజి, కటారి సురేష్, గోల్డ్ శీను, పరశురామ్, కుంటు, ప్రకాశ్, శీను పాల్గొన్నారు.

సామాజిక దార్శనికుడు

సమ సమాజ నిర్మాణం కోసం ఉద్యమించిన సామాజిక దార్శనికుడు జ్యోతిరావు పూలే అని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు సుబ్బన్న, రామకృష్ణ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకేపోగు ప్రభాకర్ లాయర్ ప్రసాద్, హనుమంతురావు, చంద్రబోస్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ నేతలు



నగరపాలక సంస్థ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

భూ సమస్యలపై నివేదిక పంపుతాం

- ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన పెంచుకోవాలి
- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (సెంట్రల్): అసైన్‌మెంట్, 22ఏ, అలైనేషన్, ల్యాండ్ రెగ్యులేషన్, ఇనామ్, రీ సర్వే తదితర అంశాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిపై తగు సూచనలు క్రోడీకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రెవెన్యూ అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌లో జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, డీఆర్వో, ఆర్‌డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో అపరిష్కృతంగా ఉన్న భూ సంబంధిత సమస్యలపై డివిజన్ వారీగా కలెక్టర్ రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రకరకాల భూ సమస్యలు ఉంటాయని, కొన్ని సమస్యలకు సంబంధించి నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఉంటుందన్నారు. ఇలాంటి సమస్యలు, సూచనలు ఏవైనా ఉంటే వాటి వివరాలతో గ్రామాల వారీగా తయారు చేసి 14వ తేదీ లోపు తమకు పంపాల ఆర్‌డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు ఆర్ఓఆర్ చట్టంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రీసర్వేలో తప్పులు చేయకూడదని కలెక్టర్ రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. రీసర్వే, వెబ్‌ల్యాండ్ తదితర టెక్నికల్ సమస్యలు ఏమైనా ఉంటే తమకు పంపించాలని, వాటిని రాష్ట్రస్థాయిలో ఎస్‌బీసీ టీంకు, సీసీఎల్ఏకు పంపుతామని కలెక్టర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను రీ ఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. మండల సర్వేయర్ల లాగిన్‌లలో పెండింగ్ ఉన్న సమస్యలను త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. నీటి పన్ను వసూలులో ప్రత్యేక చొరవ తీసుకుని ఒక డ్రైవ్ లాగా చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆర్‌డీఓలు సందీప్ కుమార్, భరత్ నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

కర్నూలు: కర్నూలు శివారులోని తుంగభద్ర బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్ఆర్ఎంటీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న గిరీశ్వర్ రెడ్డి (40) మృతి చెందాడు. కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన ఈయన ప్రస్తుతం కర్నూలు గణేష్ నగర్‌లో నివాసముంటూ ఎస్ఆర్ఎంటీ వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గురువారం రాత్రి సొంత పని మీద ద్విచక్ర వాహనంపై కర్నూలు మండలం పంచలింగాల గ్రామానికి వెళ్లి తిరిగి కర్నూలుకు బయలుదేరాడు. కాగా హంద్రీ బ్రిడ్జి వద్ద హైదరాబాదు–బెంగళూరు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి అదుపు తప్పి కింద పడ్డాడు. గమనించిన గిరీశ్వర్ రెడ్డి తన బైక్‌ను పక్కకు ఆపి పరిగెత్తుకుంటూ వెళ్లి రోడ్డుపై పడివున్న వ్యక్తిని (అతను కూడా డ్రైవరే) పైకి లేపి పంపించాడు. ఆ తర్వాత తన వాహనం దగ్గరకు వెళ్లేందుకు గిరీశ్వర్ రెడ్డి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు భార్య మహాలక్ష్మితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నేతలు

కర్నూలు (అర్బన్): నగరంలోని కార్మిక అడ్డాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప విన్నవించారు. శుక్రవారం స్థానిక కార్మిక శాఖ కార్యాలయంలో ఉప కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వర్లును కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల అడ్డాలలో కార్మికులు వడదెబ్బకు గురికాకుండా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 47,000 క్లైయిమ్‌లను ఉన్నతాధికారులు చర్చించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి నల్లన్న, సంఘం నాయకులు కృష్ణ, యిర్మియా, మాణిక్యం, మద్దిలేటి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని కొత్తపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)ను వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ కేవీఎస్ఎన్. అనిల్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఓపీ విభాగం, మందుల గది, వ్యాక్సిన్ నిల్వ యంత్రాలను పరిశీలించారు. అనంతరం జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా అక్కడే ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పి. శాంతికళతో కలిసి ఆయన పాల్గొని ప్రసంగించారు. 2003 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11న జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యేడాది ×మాతాశిశు సంక్షేమమే దేశ సౌభాగ్యం₹ అనే నినాదంతో జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన ప్రారంభం–ఆశాజనక భవిష్యత్ అనే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గర్భిణీ ఆరోగ్యసేవల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో యునిసెఫ్ కన్సల్టెంట్ నాగేంద్ర, డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీఐఓ డాక్టర్ నాగప్రసాద్‌బాబు, డెమో శ్రీనివాసులు శెట్టి, వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, డీపీఓ విజయరాజు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్టునిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



గర్భిణికి దుస్తులు, పండ్లు అందజేస్తున్న జేడీ డాక్టర్ అనిల్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ

అంబేడ్కర్ భవన్ ఆధునికీకరణ పనుల పరిశీలన

కర్నూలు (టౌన్): రాజ్ విహార్ సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ సత్యనారాయణ, డీఈఈ కృష్ణలత, ట్రైనీ ఏఈ మహేష్ లకు కమిషనర్ పలు సూచనలు చేశారు. అలాగే అంబేడ్కర్ భవన్‌లో ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్ తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 14న కలెక్టర్ రంజిత్‌బాషా ఆధునికీకరించిన భవన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో ఈ నెల 12వ తేదీన శనివారం విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్ల మరమ్మతు పనులు చేపడుతుండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కర్నూలు డివిజన్ ఈఈ టీ.శేషాద్రి తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సి.క్యాంపు సెంటర్, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ, గణేష్‌నగర్, జొహరాపురం, నందికొట్కూరు, నంద్యాల రహదారులు, కృష్ణానగర్, పాతనగరం, ఇండస్ట్రియల్ ఎస్టేటు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. కాగా మరోవైపు నగరంలోని వివిధ ప్రాంతాల్లో మరమ్మతు పనుల కారణంగా ఉదయం 7 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని కర్నూలు టౌన్ డివిజన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కల్లూరు : మహిళలు వివిధ రకాల జీవనోపాధులను చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి పథంలో పయనించాలని డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం తడనపల్లె గ్రామంలో గ్రామంలో పర్యటించి పశువుల వసతి గృహాన్ని, పాలకోవ కేంద్రాలను, ఉల్లి సోలార్ డ్రైయర్లను పరిశీలించారు. పొదు పు సంఘాల మహిళల అభ్యున్నతికి స్త్రీ నిధి, ఉన్నతి, ఐక్య సంఘాలు, బ్యాంకులు, మండల సమాఖ్యలు, గ్రామ సంఘాల ద్వారా పెట్టుబ డిని అందించడానికి సెర్ప్ సిద్ధంగా ఉందన్నా రు.కార్యక్రమంలో ఏపీఎం పుష్పావతి, సీసీలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తే సహించేది లేదు

కర్నూలు(సెంట్రల్): రైతులను దగా చేస్తే సహించేది లేదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం అన్నారు. శుక్రవారం సీఆర్‌భవన్ ఆవరణలో అఖిల భారత కిసాన్‌సంఘ్(ఏఐకేఎస్) 90వ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ముందుగా ఏఐకేఎస్ జెండాను జగన్నాథం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏపీలో రైతులకు ప్రతియేటా రూ.20 వేలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు పట్టించుకోవడం లేదన్నారు. అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 60 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈనెల 15,16,17 తేదీల్లో తమిళనాడులోని నాగపట్నంలో జరిగే ఏఐకేఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, రామకృష్ణారెడ్డి, పుల్లన్న, దొడ్డిపాడు బాషా, నాగరాజు, మాణిక్యం పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న జగన్నాథం

31 మందికి ఉద్యోగ నియామక పత్రాలు



నియామకపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు, నంద్యాల మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలు, నర్సింగ్ కాలేజీల్లో కాంట్రాక్టు/అవుట్ సోర్సింగ్ కింద 9 కేటగిరిలకు చెందిన పోస్టులకు ఎంపికైన 31 మంది అభ్యర్థులకు కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చేతుల మీదుగా శుక్రవారం నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులలో వివిధ టెక్నికల్, నాన్ టెక్నికల్ పోస్టుల నియామాల కోసం 2023లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో మెరిట్, రోస్టర్ ప్రకారం వీరు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఏడీ అనిల్‌కుమార్‌రెడ్డి, నర్సింగ్ కాలేజి ప్రిన్సిపల్ మంజుల రాణి, ఏవోలు లక్ష్మీప్రసన్న, రమ్య పాల్గొన్నారు.

ప్రీమెచ్యూర్ కవలలకు చికిత్స విజయవంతం

కర్నూలు(హాస్పిటల్): ప్రీమెచ్యూర్ (7 నెలలకు) జన్మించిన కవలలకు ఆరోగ్య సమస్యలను విజయవంతంగా పరిష్కరించినట్లు నియోనెటాలజిస్టు డాక్టర్ ఆర్‌డీ రచన తెలిపారు. శుక్రవారం విశ్వభారతి మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పత్తికొండకు చెందిన నాయుడు భార్య జ్యోతి గత నెల 3వ తేదిన విశ్వభారతి మెడికల్ కాలేజీలోని గైనిక్ విభాగంలో అత్యవసర పరిస్థితిలో చేరిందన్నారు. ఆమెకు ఏడు నెలల గర్భంలోనే కవలలు జన్మించినట్లు తెలిపారు. ఈ శిశువులు కేవలం ఒక కిలో, మరొకరు 1.3 కిలోల బరువుతో జన్మించారన్నారు. వీరికి సాధారణంగా ముందస్తు జననంలో కనిపించే ఊపిరితిత్తుల అభివృద్ధి లోపం, మింగడంలో ఇబ్బంది, శరీర ఉష్ణోగ్రత నియంత్రణ లోపం వంటి సమస్యలు ఎదురయ్యాయన్నారు. దీంతో ఆ శిశువులను ఎన్ఐసీయూలో ఉంచి అవసరమైన చికిత్సలు అందించినట్లు చెప్పారు. నెలరోజుల చికిత్స అనంతరం ఇద్దరు శిశువులు ఆరోగ్యంగా ఉన్నారని, తల్లిపాలు తాగుతున్నట్లు తెలిపారు.

గరుడ వాహనంపై విహరించిన శ్రీలక్ష్మీరంగనాథుడు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం స్వామివారు గరుడ వాహనంపై గ్రామ పురవీధుల్లో విహరించారు. ముందుగా స్వామివారి మూల విగ్రహానికి, ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గరుడ వాహనంపై ఉంచి పూజలు చేపట్టారు. అనంతరం భక్తుల గోవిందనామస్మరణల మధ్య స్వామివారి గ్రామోత్సవం వైభవంగా సాగింది. భక్తులు కొబ్బరి కాయలు, కర్పూరహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన సందీప్

కర్నూలు: కర్నూలు బళ్లారి చౌరస్తా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. స్థానిక లక్ష్మీనగర్‌లోని గౌసియా కాంప్లెక్స్‌లో నివాసముంటున్న సందీప్ (18) ఏపీఎస్పీ రెండో బెటాలియన్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఓ పెయింట్ దుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. కల్లూరు ఎస్టేట్‌లో ఉన్న గోడౌన్‌లో ఉన్న స్టాక్‌ను తెచ్చేందుకు గురువారం రాత్రి ఆటోలో బయలుదేరాడు. కృష్ణానగర్ వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో సంపత్ నగర్‌లోని అపోలో టైర్ షాపు వద్ద హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్లే కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ పుల్లయ్య స్వల్ప గాయాలతో బయటపడగా ఆటోలో కూర్చున్న సందీప్‌కు ఛాతీపై బలమైన గాయాలయ్యాయి. ఆటో కూడా పూర్తిగా ధ్వంసమైంది. మరో ఆటోలో వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించగా సందీప్ కోలుకోలేక శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తల్లి వరలక్ష్మి ఆసుపత్రిలో ఆయాగా పనిచేస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి ఆటోడ్రైవర్ పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.